క్లుప్తంగా

క్రికెట్ కిట్ అందజేత



గోపాల్‌పేట: మండలంలోని తిర్మలాపూర్‌లో బుధవారం యువకులకు మాజీ మంత్రి చిన్నారెడ్డి కుమారుడు జిల్లెల ఆదిత్యారెడ్డి ఉగాది పర్వదినం సందర్భంగా క్రికెట్ కిట్ అందించాడు. యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీన్‌కుమార్, పర్వతాలు యాదవ్, బొజ్జన్న, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు కోరారు. ఆత్మకూర్ పట్టణంలో బుధవారం 213 బూత్‌లో ఉగాది సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిధులను వినియోగిస్తూ ప్రధాన మంత్రిపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. కేంద్రం అందిస్తున్న పథకాలను వాడుకొని బీఆర్ఎస్ నాయకులు చేసే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాగేందర్‌రెడ్డి, రేచింతల శ్రీనివాసులు, ఎదుల రాజు, హరీష్, అశోక్, మండ్ల సూరి, సాయి, రఘు, బాలస్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వర ఆలయానికి విరాళం



కొత్తకోట: మండలంలోని కానాయపల్లికి చెందిన బక్క తిరుపతి, సరోజ దంపతుల కుమారులు మల్లికార్జున, అయ్యప్ప, రేవంత్ స్థానికంగా ఉన్న కోటిలింగేశ్వర ఆలయానికి రూ.27,116లు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా వారు విరాళాన్ని ఆలయ నిర్వాహకులు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో ప్రతిష్ఠించే 20 శివకోటి యంత్రాల ద్వారా పదకొండు వేల లింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి విరాళాలు సేకరిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. కాగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పారిజాతమ్మ, అర్చకులు పాలొన్నారు.

వాలీబాల్ పోటీలు



వీపనగండ్ల: ఉగాది పండగను పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం యువకులు వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలోని యువకులు 6 టీంలుగా ఏర్పడి వాలీ బాల్ పోటీలో పాల్గొనడంతో గ్రామంలోని క్రీడాభిమానులు పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో గ్రామానికి చెందిన గుండ్లపల్లి కర్నాకర్‌రెడ్డి, సంబు రవీందర్‌రెడ్డి క్రీడల్లో పాల్గొన్న యువకులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

తాటిపాములలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు



పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం గ్రామంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను సర్పంచ్ సత్యంయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతుందన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి సర్పంచ్ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుర్మన్న, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2008 పదో తరగతి పూర్వ విద్యార్థులు తన స్నేహితుడు అంజునాయక్ కొద్దిరోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో తోటి సహచరులంతా కలిసి కుటుంబానికి రూ.61వేల ఆర్థికసాయం అందించారు.



అమరచింతలో ఉగాది పూజల్లో పాల్గొన్న పట్టణ ప్రముఖులు



పామిరెడ్డిపల్లిలో భజన చేస్తున్న భక్తులు



వనపర్తిలో పంచాంగం వింటున్న ప్రజలు

షడ్రుచుల సమ్మేళనం ఉగాది

కొత్తకోట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని కోదండ రామాలయంలో జ్యోతిష్య పండితుడు రఘుశర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాది ద్వాదశ రాశుల వారి ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు ఎలా ఉంటాయో, 12 రాశుల వారికి మరిన్ని విజయాలు వరించాలంటే ఎలాంటి నియమాలు పాటించాలో పండితులు వివరించారు. రక్షణ శాఖ బాగా పనిచేయటం వల్ల ప్రజల ప్రశాంతంగా ఉంటారన్నారు. పరిశ్రమలు, రియాల్టీ, నిర్మాణ రంగాలు సానుకూలంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పొగాకు విశ్వేశ్వర్, రాములు, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రజలు బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పురోహితులు పంచాంగాలను ఆవిష్కరించారు.

అమరచింత: కొత్త తెలుగు సంవత్సరాది శోభకృత నామ సంవత్సరంలో అందరికి శుభాలు జరగాలని, అందులో మనం ఉండాలని ప్రతి ఒక్కరూ భగవంతుడిని ప్రార్థించాలని వేదపండితుడు జంగం జగదీష్ అన్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.



గట్టుకాడిపల్లిలో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

ఆత్మకూర్‌లో..

మున్సిపల్ కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆవరణంలో సాయంత్రం పంచాంగ శ్రవణంను వేద పండితుడు గుండాచారి వినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం తెలుగు సంవత్సరాది ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు, యువకులు, విద్యార్థులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామసమీపంలోని కామదేనుపల్లి అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవర్ధనగిరి, వీపనగండ్ల, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేద బ్రాహ్మణులు, పంచాంగ శ్రవణం చేశారు.

పాన్‌గల్: నూతన సంవత్సరాది ఉగాది వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఇంటి ముంగిళ్లను పచ్చని మామిడి ఆకుల తోరణాలు, పూలతో అందంగా అలంకరించి, కొత్త దుస్తులు ధరించి, ఆలయాల్లో దేవుడికి నైవేద్యం సమర్పించారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ సంబంధించిన కాడెద్దులను ప్రత్యేకంగా అలంకరించుకొని డప్పులతో ఊరేగింపు చేస్తూ రైతులు నృత్యాలు చేశారు.



ఖిల్లాఘనపురంలో..



మద్దిగట్ల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద..



తెల్లరాళ్లపల్లి ఆత్మకూర్‌లో..



గోవర్ధనగిరి ఆలయంలో..



అమరచింతలో పంచాంగం వింటున్న చైర్‌పర్సన్ మంగమ్మ



కొత్తకోట రామాలయంలో పంచాంగం వివరిస్తున్న రఘుశర్మ



ఆత్మకూర్‌లో..

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'

పాన్‌గల్: ప్రభుత్వం అంధత్వ నివారణ కోసమే గ్రామాల్లో ఉచితంగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకొని అర్హులందరూ పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని దొండాయిపల్లి, రేమద్దుల, తెల్లరాళ్లపల్లితండాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయని, ఆయా గ్రామాల్లో శిబిరాలపై వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. 18ఏళ్ల పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది అవగాహన పెంచాలన్నారు.

బిల్కన్‌భానో దోషులను జైలుకు పంపాలి

పాన్‌గల్: గుజరాత్ రాష్ట్రంలో బిల్కన్‌భానోపై సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో శిక్ష పడ్డ 11 మంది దోషులను మళ్లీ జైలుకు పంపాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కళావతమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్ష పడిన 11 మంది దోషులను ఆ రాష్ట్ర ప్రభుత్వం సత్ప్రవర్తన పేరుతో శిక్ష పూర్తికాక ముందే వదిలివేయడం సరికాదన్నారు. శిక్ష పడిన దోషులను ప్రభుత్వం వదిలివేయడంపై మహిళ లోకం తీవ్ర ఆవేదనకు గురైందన్నారు. తీవ్ర నేరాలలో శిక్ష పడిన వారిని ప్రభుత్వాలు సత్ప్రవర్తన పేరుతో వదిలేస్తే కోర్టుల తీర్పుకు విలువేముంటుందని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

కంకర తేలిన రోడ్డు

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త, పాత యాపట్ల గ్రామాల ప్రజలు మారేడుమాన్‌దిన్నె, చంద్రబండతండా, వేడుకరావుపల్లి తండా గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై నుంచే మండల కేంద్రానికి చేరుకుంటారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో బీటీ రోడ్డు కొట్టుకుపోయి కంకర తేలింది. అచ్చంపేట, కొల్లాపూర్ ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మత్తులు చేసి బీటీ రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బీటీ రోడ్డుకు నిధులు మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న సుబ్బయ్యయాదవ్

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ నుంచి కదిరెపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణం, శాగాపూర్ పాఠశాల సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేయించడంపై ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు హలీమ్ పాష గ్రామస్తుల తరపున హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవలే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయడం హర్షించదగిన విషయం అన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు, మంజూరుకు సహకరించిన మండల ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణ, నర్సింహస్వామి, చిన్నకృష్ణయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



దేవరకద్ర: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మేధావుల ఫోరం కన్వీనర్ బాలకృష్ణ కోరారు. బుధవారం మండల కేంద్రంలో కరపత్రాలు, వాల్మీకి ఫొటోలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వాల్మీకులను చైతన్య పరచడానికి ఇంటింటికీ కరపత్రాలను, వాల్మీకి ఫొటోలను అందజేస్తున్నామని తెలిపారు. ఎస్టీ జాబితాలో ఉన్న వాల్మీకి కులస్తులను తిరిగి బీసీ-ఏలో చేర్చారని ఆయన తెలిపారు. వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు హరికృష్ణ, వెంకట రాములు, గుడిబండ రాములు, జగన్మోహన్, దినేష్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని మండల సాధన సమితి జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్ గేటు వద్ద ఏర్పాటు చేసిన రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలనా సౌలభ్యం కోసం గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట జేఏసీ నాయకులు ఆంజనేయులు, రవి, రాజు, భానుగౌడ్, రాజు, చిన్న, మహేష్‌చారి, కృష్ణయ్య, దమాయపల్లి రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రిలేదీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

బస్సు ప్రారంభం



కోయిల్‌కొండ: మండల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదేనుసారం కోయిల్‌కొండ నుంచి కోస్గికి ఆర్టీసీ బస్సును బుధవారం ప్రారంభించారు. బస్సు ప్రతిరోజూ ఐదు ట్రిప్పులు తిరుగుతుందని తెలిపారు. బూర్గుపల్లి, సూరారం, కొత్లాబాద్ సర్పంచ్‌లు చంద్రకళ, కరుణాకర్‌రెడ్డి, మల్లాలచరితలు గ్రామాల్లో ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. కోయిల్‌కొండ మీదుగా వయా ఖాజీపూర్, నల్లవల్లి, బూర్గుపల్లి, సూరారం, కోత్లాబాద్ మీదుగా కోస్గి వరకు వెళ్తుంది.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు దేవల్‌తిరుమలాపుర, పెద్దకార్పాములలలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంపీడీఓ కార్యాలయం పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుంది. దేవల్‌తిరుమలాపూర్‌కి తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్లు కేఎల్ఐ కాల్వ పక్కన లీకేజీతో నీరంతా రైతుల వ్యవసాయ పొలాలకు వెళ్తున్నాయి. పెద్దకార్పాములలో ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీతో సీసీ రోడ్లపై పారుతోంది. ఈ పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల భారిన పడుతారన్నారు. లీకేజీలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కోటి సంతకాల సేకరణ

గోపాల్‌పేట: బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రవర్ణ పేదల అభ్యున్నతి కోసం డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్రకు మద్దతు తెలిపి అండగా నిలవాలని డీఎస్పీ నాయకులు కోరారు. బుధవారం రేవల్లి మండల కేంద్రంలో డీఎస్పీ విశారధన్ మహారాజ్ పాదయాత్రకు మద్దతుగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం గొప్పతనం తెలిపి రాజ్యాంగం ద్వారా ఎలా అభివృద్ధి చెందాలని వివరించేందుకు విశారధన్ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల కోఆర్డినేటర్ కురుమన్న, మండల అధ్యక్షుడు చిన్నరాములు, జిల్లా కార్యదర్శి ఎల్లస్వామి, స్టేట్ కమిటీ సభ్యులు సూర్యప్రకాశ్, జిల్లా కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న డీఎస్పీ నాయకులు

నిత్యావసర సరుకుల పంపిణీ

చిన్నచింతకుంట: రంజాన్ పండగను పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టే 70మంది ముస్లింలకు మండల కేంద్రంలోని మదీనా మసీదు వద్ద మెర్సీ ఫర్ ఆల్ ట్రస్ట్ సభ్యులు ఫక్రుద్దీన్ అలీ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ అలీ మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలు నెలరోజుల పాటు ముస్లింలు నిష్ఠతో చేపడుతారన్నారు. అందుకు పేద ముస్లింలకు ఇబ్బందులు కలుగకుండా నిత్యావసర సరుకులను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు రఫీఉద్దీన్, ఉపాధ్యక్షుడు జహంగీర్, మండల కోఆప్షన్ మెంబర్ మహెమూద్, పాష పాల్గొన్నారు.



నిత్యవసర సరకులు అందిస్తున్న ఫక్రుద్దీన్ అలీ

ఇబ్రహీంనగర్‌లో జల్ది బిందె వేడుకలు



కోయిల్‌కొండ: మండలంలోని ఇబ్రహీంనగర్‌లో బుధవారం ఉగాది సందర్భంగా అభయ ఆంజనేయ స్వామి జల్దిబిందె, పల్లకీసేవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని ఎర్రజిన్న బావి నుంచి జల్దిబిందెను ఊరేంగిపుగా కోలాలు, భజనలతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు తీసుకవచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లయ్య, గురువేందర్, రామస్వామి, పరమేష్, సాయి పాల్గొన్నారు.

పక్కా నిర్మాణాలపై పేదల దృష్టి

- గుడిసెల పోరులో లబ్ధిదారుల నిర్ణయం
- నేటికీ 196 రోజులు పూర్తి

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో గల సర్వే నంబర్ 547, 548లో గల పద్నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలకు కేటాయించిన స్థలాలు చూపాలని నిర్వహిస్తున్న గుడిసెల పోరు నేటికీ 196 రోజులు పూర్తి చేసుకుంది. సెప్టెంబర్ 6, 2022 నుంచి ప్రారంభమైన గుడిసెల పోరు నేటికీ కొనసాగుతుంది. గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చిన అధికారులు వాటికి తగిన స్థలాలు పొజిషన్ చూపాలంటూ లబ్ధిదారులు ఆందోళన నిర్వహిస్తున్నారు. గుడిసెల పోరుకు సీపీఎం మద్దతు ఇవ్వడంతో 430 మంది లబ్ధిదారులు తాత్కాలికంగా గుడిసెలను నిర్మించుకొని అక్కడే జీవిస్తున్నారు. ఒకొక్కరు రూ.10 నుంచి రూ.15 వేలు ఖర్చుచేసి తడికలతో గుడిసెలను నిర్మించుకున్నారు. వారం రోజుల కిందట గాలి, వానకు గుడిసెల తడికలు కూలడంతో ఇక పక్క నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నారు. జీఓ నంబర్ 58, 54 ప్రకారం ఎవరైనా ప్రభుత్వ భూమిలో నిరుపేదలు ఇంటి స్థలాల కోసం కబ్జాలో ఉంటారో వారికే అవి చెల్లుతాయన్న ఆదేశాలతో మొక్కవోని ధైర్యంతో లబ్ధిదారులు ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఈదురు గాలులకు పట్టణంలోని దుంపాయికుంటలో ఒరిగిన గుడిసెలు